క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

నాగారం : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకంలో భాగంగా నేడు మండల పరిధిలోని వర్ధమానుకోట రైతువేదికలో జరిగే రుణమాఫీ సంబరాలకు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరుకానున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పెందోట గణేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య బుధవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఈ సంబరాలను రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అందుబాటులో ఎరువులు

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం పీఏసీఎస్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు సంఘం చైర్‌పర్సన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా 444బస్తాలు, 20.20.0.13 రకం ఎరువులు 500బస్తాలు, 14.35.14 రకం ఎరువులు 100బస్తాలు అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

నాగారం ఎస్‌ఐ బదిలీ

నాగారం : మండల ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.వెంకట్‌రెడ్డి బుధవారం నల్లగొండ 12వ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక సీఐ రఘువీర్‌రెడ్డి, ఏఎస్‌ఐ వెంకట్రాములు, పోలీసులు సిబ్బంది శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కాగా మండల నూతన ఎస్‌ఐగా ఇంకా ఎవరిని నియమించలేదు. కార్యక్రమంలో సిబ్బంది సుధాకర్, వీరన్న, శేఖర్, ఎల్లయ్య, రవీందర్, నారాయణరెడ్డి, వీరు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన పాలకుర్తి సోమక్క అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులకు బుధవారం కాంగ్రెస్ నాయకులు కుంభం మంజులసతీష్‌గౌడ్ రూ.5వేలు, 50కేజీల బియ్యాన్ని అందజేశారు. వారి వెంట నాయకులు సంకెపల్లి దామోదర్‌రెడ్డి, పొన్నం సోమయ్య, ఆకుల వీరయ్య, చిత్తలూరు నర్సయ్య, పొన్నం వెంకన్న, శ్రీశైలం, సోమయ్య, రమేష్, ప్రభాకర్ ఉన్నారు.

పీర్లకొట్టం అభివృద్ధికి విరాళం

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలోని పీర్లకొట్టం అభివృద్ధికి అర్వపల్లికి చెందిన కడారి నాగేంద్ర కుమారుడు కడారి శివ బుధవారం నిర్వాహకులకు రూ.5,016 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పీర్ల కొట్టం నిర్వాహకులు శివను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు కేసగాని మహేశ్వర్, కేసాని రామనర్సయ్య, పసుల మల్లయ్య, ముజావర్ షేక్ జహంగీర్, ఉపేందర్, వెంకటేష్, కార్తీక్, రాహుల్, నిషాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

నాగారం : తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జరిపేట జైపాల్‌ను బుధవారం వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు గొలుసుల మహేష్, ఆలకుంట్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ వీరప్రసాద్‌యాదవ్

అర్వపల్లి : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రుణమాఫీపై రైతులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. అర్వపల్లిలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీకి కొర్రీలు పెడుతూ రైతులకు ఇచ్చిన హామీ మర్చిపోయారని అన్నారు. రుణం తీసుకున్న రైతులందరికి ఏకకాలంలో రుణమాఫీ చేయాలని కోరారు. రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన పెట్టడంతో కార్డులు లేని రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి నరేష్, బైరబోయిన పెద్దయ్య, మామిడాల రాజలింగం, అరిగె నాగరాజు, కొమారి నాగరాజు, బి.వెంకన్న, దావుల లింగయ్య, ఎ.వెంకన్న, కె.రవీందర్‌నాయక్, నాగరాజు, ప్రసాద్, శ్రీను, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- సీసీ రోడ్లు లేక వీధులన్నీ బురదమయం
- ఎక్కడికక్కడే నిలుస్తున్న మురుగునీరు
- దోమలు వృద్ధి చెందుతున్నాయని ప్రజల ఆందోళన
- ట్యాంకులు శుభ్రం చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపణలు



తిరుమలగిరి 4వ వార్డులో బురదమయంగా రోడ్డు



బీసీ కాలనీలోని కాల్వల్లో నిలిచిన మురుగునీరు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెత్తను సేకరించే వాహనాలు రిపేరుకు రావడంతో సమస్య జఠిలంగా మారింది. మున్సిపాలిటీలో చెత్త సేకరించడానికి రెండు ట్రాక్టర్లు, 8 టాటా ఏస్ వాహనాలు ఉన్నాయి. 8 టాటా ఏస్ వాహనాల్లో ఐదు రిపేరుకు వచ్చాయి. చెడిపోయిన వాహనాలను రిపేర్ చేయించడానికి డబ్బులు చెల్లించక పోవడంతో వాహనాలన్నీ షెడ్‌లోనే మూలుగుతున్నాయి. గతంలో చెత్త సేకరించే వాహనాలు ప్రతి కాలనీకి ప్రతి రోజు లేదా రోజు విడిచి రోజు వచ్చేవి. ఈ వాహనాలు ప్రతి బజార్‌లోని ఇళ్ల ముందుకు రాగానే ఇంటి యజమానులు తమ ఇళ్లలోని చెత్తను చెత్త బండిలో వేసేవారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో కొన్ని వీధుల్లో 4 రోజులకు ఒకసారి కూడా చెత్త వాహనాలు రాకపోవడంతో ఇంటి యజమానులు ఇళ్ల ముందు, ఖాళీ ప్రదేశాల్లో మురుగు కాల్వల్లో చెత్తను వేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. వర్షా కాలం కావడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. చెత్త సేకరణపై ఫిర్యాదు చేసినా ప్రజా ప్రతినిధులు, అధికారులు గాని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇవిగో సమస్యలు

మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ ప్రదేశాల్లో వివిధ రకాల పిచ్చి మొక్కలు పెరగడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో అంతర్గత వీధుల్లో సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో లేకపోవడంతో వర్షం వస్తే బురదమయంగా మారుతున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోని మురుగు కాల్వల్లో చెత్తను తీయక పోవడంతో కాల్వల్లో నీళ్లు నిలిచి ఈగలు, దోమలు వృద్ధి చెంది ఇళ్లలోకి చొరబడుతున్నాయి. తేళ్లు, పాములు సంచరిస్తున్నాయి. మంచి నీటి ట్యాంకులు సైతం కొన్ని చోట్ల సకాలంలో శుభ్రం చేయకుండానే నీళ్లు సరఫరా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై దృష్టి సారించకుంటే మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు



మా కాలనీకి 5 రోజుల నుంచి ఒక్క చెత్త బండి రాలేదు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా ఉంటున్నాయి. ఎవరికి చెప్పినా రావడం లేదు.

– మోదుగు కొండల్‌రెడ్డి, బీసీ కాలనీ

పాములు తిరుగుతున్నాయి



మా వీధిలో మొత్తం పిచ్చి మొక్కలు మొల కెత్తాయి. వీటిని సిబ్బంది తొలగించడం లేదు. కొద్ది రోజులుగా ఈ మొక్కల్లో పాములు తిరుగుతున్నాయి. ఇప్పటికైనా సిబ్బంది చెత్తను తొలగించాలి.

– సైదులు, 7వ వార్డు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైట్‌హౌస్‌లో 10వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పందిరి మల్లేష్‌గౌడ్ 50మంది అనుచరులతో, సూర్యాపేట మండలం రామచంద్రాపురం మాజీ సర్పంచ్ మాలి అనంతరెడ్డి 100మంది అనుచరులతో కలిసి దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం దామోదర్‌రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో అన్ని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని సూచించారు. కష్టపడిన ప్రతిఒక్కరికి పదవులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, బీరవోలు రవీందర్‌రెడ్డి, కోతి గోపాల్‌రెడ్డి, రామస్వామి శ్రీనివాస్‌నాయుడు, ఆదిమల్ల కృష్ణ, కనుకు వెంకన్న, కట్టే నరేష్, జానయ్య, సురేష్, వేణు, సతీష్, నగేష్, శ్రీను, నాగరాజు, నాగయ్య, మహీన్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో సిబ్బందిని నియమించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ సభ్యులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని గిరినగర్ పీహెచ్‌సీలో సరిపడా సిబ్బందిని నియమించడంతో పాటు మందులను సరఫరా చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గిరినగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి ఇన్‌చార్జ్ డాక్టర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది, సరైన మందులు లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం మెరుగుపరచాలన్నారు. లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌ఎంపీలను, పీఎంపీలను గుర్తించి వారికి ఉచిత శిక్షణ ఇస్తామని ప్రకటించడం హర్షనీయమని ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనర్సయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనరిసింహ, ఎంపీ రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆర్‌ఎంపీలకు, పీఎంపీలకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు కూడా అందజేయాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేలా కార్యచరణ రూపొందించాలని కోరారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమను గుర్తించి అభివృద్ధికి సహకరించారని, తిరిగి మళ్లీ 10ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వమే ఆర్‌ఎంపీలను గుర్తించిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి రాజేందర్, సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె.రెహమతుల్లా, బెల్లంకొండ డాంగ్‌డేగౌడ్, జేరిపోతుల లక్ష్మణ్, రాజబాబురెడ్డి, వెంకన్న, ఎస్‌కె.నాగుల్‌మీరా, నాగరాజు, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఉద్యానవన అధికారి జగన్, రైతులు

పెన్‌పహాడ్ : నీటివసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూర్యాపేట డివిజన్ ప్రాంతీయ ఉద్యాన అధికారి కన్న జగన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ఆయిల్ పామ్ మేగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా రైతు దీపాకుమారి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పంటకు కూలీ ఖర్చులు తక్కువ, కోతుల బెడదలేదన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే విక్రయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ మేనేజర్ జె.హరీష్, జూనియర్ మేనేజర్ శశికుమార్, క్షేత్ర సహాయకులు లక్ష్మీనారాయణ, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు మల్లేష్, అనిల్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడద నివారించాలి

తుంగతుర్తి : గ్రామాల్లో వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాలల్లో, పట్టణాలల్లో వీధి కుక్కలు సంచరిస్తూ పిల్లలు, పెద్దలపై దాడులు చేస్తున్నాయన్నారు. అదే విధంగా కోతులు గ్రామాల్లో పంటలను నాశనం చేస్తున్నాయని అన్నారు. ఆయన వెంట వెంకన్న, శ్రీనివాస్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



సూర్యాపేట : పట్టణంలోని పెద్దమసీదు వద్ద పీర్ల ఊరేగింపులో పాల్గొన్న నిర్వాహకులు

సూర్యాపేట : పట్టణంలో మొహర్రం (పీర్ల పండుగ)ను బుధవారం ఘనంగా నిర్వహించారు. మొహర్రం చివరి రోజు జిల్లా కేంద్రంలోని సవర్ల కొట్టం వద్ద పీర్లను ఉంచి వేడుకలు చేశారు. ఉదయం అగ్నిగుండాల ప్రదర్శన, సాయంత్రం వాడవాడలో భక్తులు పీర్లకు జలబిందెలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యువత డప్పు వాయిద్యాలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూజారులు సైదులు, మల్సూర్, కమిటీ సభ్యులు కోల శ్రీరాములు, మధు, శ్రీను పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల వ్యాప్తంగా బుధవారం మొహర్రం వేడుకలను హిందువులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, కొమ్మాల, కాసర్లపహాడ్, బొల్లంపల్లి, రామన్నగూడెం తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయా గ్రామాల్లోని బావుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, సైదుల కిరణ్, కోటమర్తి వీరన్న, హబీబ్, విక్రమ్, అలీ, అర్వపల్లి ఖాజానసీరుద్దీన్‌బాబా దర్గా ఖాదీం మహ్మద్ మౌలానా, ముజావర్లు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామశివారులోని బావుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో ఎండీ మునీర్‌ఖాన్, షేక్ జానివియా, ఎండీ ఖదీర్ అఫ్‌ఖాన్, షేక్ ఖాసీం, బాలేసైదా, యూసుఫ్, సర్దార్, యాకుబ్ పాల్గొన్నారు.

నాగారం : త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలను బుధవారం మండలంలోని పసునూర్, పస్తాల, శాంతినగర్, డి.కొత్తపల్లి, ఫణిగిరి, ఈటూరు గ్రామాల్లో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని భక్తులు పీర్లకు కుడకలు, దట్టీలు కట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం రాత్రి పీర్లను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో పీర్ల ఊరేగింపు

మద్దిరాల : త్యాగానికి ప్రతీకైన మొహర్రం పండుగను బుధవారం మండలంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో మొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం చివరి రోజు కావడంతో గ్రామాల్లో పీర్లను మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు.

గోరింటాకు సంబరం



తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఆషాఢ మాసం సందర్భంగా మహిళలు, చిన్నారులు బుధవారం గోరింటాకు పెట్టుకొని సందడి చేశారు. ప్రతి ఆషాఢంలో చేతికి గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ తెలిపారు.

ఆలయాలలో తొలి ఏకాదశి పూజలు



సూర్యాపేట : శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అర్వపల్లి : తొలి ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని వివిధ ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంతోషిమాత దేవాలయం, రామలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. శ్రీ సంతోషిమాత దేవాలయంలో అర్చకులు వంశీకృష్ణశర్మ ఆధ్వర్యంలో శ్రీసత్య సాంబశివ స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సామూహికంగా శ్రీ రమ సహిత సత్య నారాయణ స్వామి వ్రతాన్ని చేపట్టారు.

శ్రీవిశ్వనాథస్వామి దేవాలయంలో..

తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా తహసీల్దార్ రోడ్డులోని శ్రీ విశ్వనాథస్వామి దేవాలయంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు పడి రైతులంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, గోపాల్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, తులసి అర్చన, విష్ణు సహస్రపారాయణం, భజనల కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్ కుమార్, రామశర్మ, వేణుగోపాలశర్మ, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో తొలి ఏకాదశి పూజలు

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని పిల్లలమర్రి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరంలో తొలి పండగ ప్రారంభం సందర్భంగా ఆలయంలో ఉన్న దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి తదుపరి ప్రత్యేక అలంకారణలో భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రఘువరన్ ఆచార్యులు మాట్లాడుతూ.. తొలి ఏకాదశి పర్వదినం నాడు ప్రాతకాలమే తలస్నానం ఆచరించి తదుపరి ఆలయ దర్శనం చేసుకోవాలని, ముఖ్యంగా విష్ణుమూర్తిని లక్ష్మీదేవి ఆరాధించాలని తద్వారా సకల ఇష్టకామ్యార్థసిద్ధి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూకంటి రాజబాబురెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట : పట్టణంలోని శివాలయంలో పూజలు చేస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



సూర్యాపేట : పట్టణంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సూర్యాపేటరూరల్ : పిల్లలమర్రిలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రేణుక

భానుపురి (సూర్యాపేట) : రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఒకేసారి రుణమాఫీ చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. బుధవారం పట్టణంలోని లెనిన్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, ఈ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మాఫీ చేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, పార్టీ పట్టణ అధ్యక్షుడు గులాం, నాయకులు వాజిద్, ఎల్లన్న, సురేష్, మహేష్, జయమ్మ, జానయ్య ఉన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ నాయకుల హర్షం

తిరుమలగిరి (తుంగతుర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయనుందని మాజీ జెడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6గ్యారంటీలను వందశాతం అమలు చేస్తుందన్నారు. రుణమాఫీ సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జరిగే సంబరాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ దుప్పల్లి అబ్బాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు గజ్జి లింగయ్య, తండు మహేష్, గజ్జి కొమురయ్య తదితరులు ఉన్నారు.

రుణమాఫీ సంబరాలకు తరలిరావాలి

పెన్‌పహాడ్ : సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేస్తున్న సందర్భంగా మండల కేంద్రంలోని రైతువేదిక నుంచి మెయిన్ సెంటర్ వరకు నిర్వహించే రైతుల భారీ ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో పడుతున్న సందర్భంగా రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నూతనకల్ : సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేస్తున్న సందర్భంగా మండల పరిధిలోని తాళ్లసింగారం రైతువేదికలో నిర్వహించే రుణమాఫీ సంబరాలను విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

రుణాలను మాఫీ చేయడం హర్షణీయం

మద్దిరాల : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంట రుణాలను మాఫీ చేయడం హర్షణీయమని ఆ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాటకు కట్టుబడిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. పంట రుణాలను మాఫీ చేయడం పట్ల రైతులు ఎంతోగానో సంతోషిస్తున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తీకుల సుధాకర్‌రెడ్డి, కొమ్ము వెంకన్న, కొమ్ము అంజయ్య, మామిడి వెంకటయ్య, రంగు జగన్, పరాల లింగయ్య, బోనగిరి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

చివ్వెంల : వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో ఈనెల 21,22,23 తేదీల్లో నిర్వహించే భారత వికలాంగ హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని గుంపుల గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఈదయ్య బాబు, మున్నా మధు, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.